# భ్రమ

నర్సిహం! నర్సిహం!!’

ఉలిక్కిపడి "ఏమిటాగావుకేక ఇదేమన్నా కోర్టనుకున్నావా పిల పడానికి?" కసురుకున్నాడు నరసింహం. ఒక క్షణం ఆగి "వచ్చిన వాడివి కూర్చుని చెప్పొచ్చుగా, అసలే టెంబేలు పడిచస్తున్నా. పిడుగులా ఉత్తరం వచ్చినెత్తిన పడింది. నీకే హాయిగా బతుకుతున్నావ్" నరసింహం దోరణి అర్థంకాక హనుమంతరావు నిలువుగుడ్లేసుకుని చూస్తుండిపోయాడు.

"బ్రహ్మచారిగాడివి నీకేం తెలుస్తుంది. మీ నాన్న ఆలోచించే నీకాపేరు పెట్టాడు. అలా స్తంభంలా నిలబడిపోయావే! కూచో" ఉత్తరం మడచి తపీమని టిపాయ్ మీద పెట్టాడు.

హనుమంతరావు కుర్చీలో కూర్చున్నాడు. వెంటనే గొంతు పెగల్లేదు. ఉత్తరం కథాకమామీషు తెలుసుకోవాలనుకున్నాడు. కాసేపాగి "అధికాదురా! నువ్వేమో ఉత్తరంలో తలదూర్చి ఏకదీక్షగా చదువుతున్నావ్ ఇంతకీ ఆ వుత్తరం"

"మీ చెల్లెలు జానకి అన్న గోపి రాశాడు. ఇవ్వాళే వస్తోందిట ఆవిడగారు."

హనుమంతరావుకు ధైర్యం వచ్చింది.

"నువ్వు మతుండేమాట్లాడుతున్నావా! ఎగిరి గంతెయ్యాల్సింది పోయి. అలా జిడ్డు మొహం పెట్టి పైగా నన్ను దబాయిస్తావేంట్రోయ్. పోనిలే ఇంకెక్కణ్నుంచైనా ఉత్తరం వచ్చిందేమో. మీ నాన్న డబ్బు పంపమని రాసేడేమో అనికున్నా."

"అలా వచ్చినా బావుణ్ను. ఇప్పుడెలా చచ్చేది. అయిదున్నర యింది. ఎనిమిదింటికల్లా ఆవిడ రైల్లో వస్తుంది."

"అవున్రా. నీకు నిజంగా మతిపోయిందా? జానకివస్తే నీ కొచ్చిన ఉపద్రవం ఏడవరా చంపక సస్పెన్సుతో"

"వెధవ ప్రశ్నలడక్క, ఇప్పుడు చకచకా పనులు జరగాలి పోసుకోలు కబుర్లు కాదు. కొంపలంటుకుంటాయి"

"నాకేం అర్థంకావడంలేదు. నే పోతున్నా. ఏమోలే చూసిపోదాం ఒకదే ఉన్నాడుగదా అని వచ్చా. నువ్వేమో పిచ్చివాగుడులో పడ్డావ్. తలా తోకా లేదు"

"హనుమంతూ! నీకు తెలుసు జానకి. అదో తిక్క మనిషి. ఇంత తక్కువ వయస్సులో ఇంత చాదస్తం ఇంకెక్కడా చూడలేదు. వెళ్ళేటప్పుడు నాకో శతకం అప్పచెప్పింది. ఎప్పుడెళ్ళినా అంతే. ఇంతకీ నాదే తప్పు. దాన్ని క్రమలో పెట్టేశా. ఇప్పుడు ఏదైనా తభావతు వస్తే తట్టుకోలేదు. టైంలేదు"

"నాకేం తెలియడంలేదు. నువ్వేం చెబుతున్నావో"

"నీదో మట్టిబుర్ర. సరిగ్గా విను జానకిదృష్టిలో నాకు ఇంటిపనులు చేతకావు, వంటరాదు, ఇల్లు క్లీన్గా వుంచను, ఆవిడలేనప్పుడు సిగిరెట్లు ఎక్కువతాగుతాను, పక్కదుప్పటికూడా మార్చి ఉతికించి వేసుకోవడం చేతకాదు. గది నిండా దుమ్ము, పుస్తకాలు చిందరవందరగా వుంటాయి. సరిగా ఇల్లువూడిపించను అవ్వచేత"

"చాల్లే వెధలిస్టూ. నువ్వునూ, అదేదో తప్పుగా ప్రవర్తిస్తున్నావ్. నీ మీద ఎంత ప్రేముంటే అలా అనుకుంటుందో తెలుసా"

"తన్నులు తింటావు ఇవ్వాళ. పెద్ద సైకాలజిస్టు అయిపోతావండి. అవిడగారి అభిమానం కొలిచే వాడు అయిపోయాడు"

"నామీద విరుచుకుపడతావేరా నన్ను పోనీ"

"నువ్వుపోతే నేను వురేసుకోవాలి. ఈ పనంతా నావల్లకాదు"

"ఏమిటాపని. తొరగా చెప్పేడు. నా చేతనైన సాయంచేసిపోతా. సరేగానీ రైల్వేస్టేషనికి పోవా"

"ఇంకేవన్నా వుందా. మా బావమరిది గోపి ఆవిడకి తెలియకుండా వుత్తరం రాశాడు. నేను అనవసరంగా శ్రమపడి స్టేషన్‌కు వెళ్ళి లేదైతే అక్కడ పడిగాపులు పడటం ఆవిడకి గిట్టదు. రైలుదిగి ఆటోలో రాలేనా చదువుకున్నదాన్ని గదా అని ఆవిడధీమా"

"పోనీ నన్నేం చెయ్యమన్నావో చెప్పు"

"ఇందాక చెప్పలేదట్రా. ఇల్లంతా అలా అలా తయారుచేయాలి"

"ఇల్లు ఇంత క్లీన్‌గా వుందిగదురా. ఎక్కడ వస్తువులక్కడ చక్కగా వున్నాయి. హాయిగా రెండుపూట్లా వండుకొని పీకలదాకా తింటున్నావ్. సిగరేట్లు జాదాపు మానేశావు.

"ఒట్టిసన్నాసివిరా. ఎంత చెప్పినా బుర్ర కెక్కదు. ఆవిడగారు లేకపోతే ఈ యిల్లు ఎలా వుంటుందని వూహించుకుంటుందో అలా తయారు చేయాలి వెంటనే. అర్థమయిందా మళ్ళీ చెప్పనా"

"అర్థమయింది. రోడ్డుమీద మట్టి తెచ్చి ఇంటి నిండా పోయనా"

"చాల్లే ముష్టి జోకూ నువ్వూ, ఆ ఏడు పేదో నేనేడుస్తా. ఆ పక్కనే సత్యంగాడి ఇంట్లోంచి అయిదారు బెర్లీ పీకలు పట్టుకురా,

అన్నట్లు వెళ్లేముందు అంటింట్లో నాలుగిన్నెలున్నాయి పొద్దున్న వండినవి రేపు పొద్దున్న గాని రాదు అవ్వ. అవి కొంచెం.

"ఇందులో నామోషీ ఏ వుంది. అంట్లు వెధవకిద జమకట్టావు"

"సారీరా హనుమంతూ! ఆపదలో ఆదుకోవడం రామాయణ కాలం నుంచీ వస్తోందిరా వీకు"

"నోరుయ్ పురాణాలు చెప్పక తొరగా తెములు. మధ్య చెల్లమ్మ వచ్చిందంటే మనిద్దరం గాడిదల మవుతాం."

హనుమంతరావు వంటింట్లోకి వెళ్ళి గిన్నెలు బరబరా తోమడం మొదలుపెట్టాడు నరసింహం గదంతా అతలా కుతలం చేసేస్తున్నాడు చిందరవందరగా పుస్తకాలు. పేపర్లు పడేశాడు మంచం మీదున్న పక్క దుప్పటి తీసి మడిచి పెట్టి దండెంమీదన్న పాతది వేశాడు. మంచం మీద ఏవేవో పుస్తకాలు పడేశాడు గది మూలల్లో కాస్త దుమ్ము పోశాడు. ఆ పరిస్థితుల్లో నరసింహాన్ని ఎవరైనా చూస్తే వెనకాముందు చూడకుండా పిచ్చాసుపత్రికి లాక్కెళ్తారు.

హనుమంతరావు వంటింట్లోంచి తొప్పుకుంటూ వచ్చి బయటి కెళ్ళాడు అటూ ఇటూ చూడకుండా

నరసింహం ఎక్కడైనా పగిలిపోయినగాజు గ్లాసుందేమో అంతా వెతికాడు. ఎక్కడా దొరకలేదు. గ్లాసు పగిలివుండటం చూడకపోతే జానకి ఫీలవుతుందని నెమ్మదిగా ఒక గ్లాసు పగలగొట్టాడు. ఎంత జాగ్రత్తగావున్నా చేయి గీరుకుంది కొంచెం నెత్తురొచ్చింది. తన్లో తాను గొణుక్కున్నాడు వెళ్ళి తడిగుడ్డ చుట్టుకున్నాడు. ఇదికూడా జానకికి ఒక విధంగా పూరటకలిగించే సంగతే అని సర్ది చెప్పుకున్నాడు తనకు తానే "ఒక్కపని చేతకాదు. నరసింహం లోలోపల ఆనందించి నవ్వుకుంటాడు. ఇప్పుడు చిన్నగా నవ్వాడు

"ఒరేయ్ నర్సింహం. ఏమో అనుకున్నా. నీకు నిజంగా మతిపో యిందిరా ఆ నవ్వేవిటా....సరే చేతికి కట్టేమిటీ"

"తెగింది సరేగాని ఆ పీకలు గది నాలుగు మూలల్లో పడేయ్. ఎలావుందిరా గదివ్పుడు".

"నీ బొందలా వుంది. నిక్షేపంలా వున్న కొంపని పాడుచేసావ్ గదరా నీ సెంటిమెంటూ నువ్వూనూ."

సన్నాసిగాడివి నీకెలా చెబితే అర్థమవుతుందిరా. ఇంతనీట్‌గా ఇల్లుచూస్తే ఇంకెవన్నా వుందా. సరే ఎలాగో అంట్లుతోమావు గదా. అక్కడున్న కూరగాయలు పట్టుకెళ్ళి సత్యంగాడి ఇంట్లో పడేయ్. ఇందాక చెప్పటం మర్చిపోయా. ఇప్పుడు ఆవిడకి మనం స్వాగతం చెప్పొచ్చు స్టేషన్కి వెళ్దామని వుందిగాని అదో గొడవ. ఎలాతెసింతని నిలదీస్తుంది. మధ్యలో గోపీ చిక్కుల్లో పడిపోతాడు. కాబట్టి విశ్రాంతిగా కాసేపు కబుర్లు చెప్పుకుందాం.

"టెలిగ్రాం సార్" బయట్నించి కేక.

"ఇదెక్కడ్నుంచి" నరసింహం గబగబా వెళ్ళాడు. తీసికుని చదువుకుంటూ వస్తూ "నా ప్రాణాలు తీశావుగదరా!"

"మళ్ళా ఏవొచ్చి పడిందిరా. టెలిగ్రాం ఎక్కణ్నుంచి".

"గోపీ ఇచ్చాడు. జానకి ఇవ్వాళ రావటం లేదు. వాళ్ళ చెల్లెలు వస్తోందిట అక్కడికి. అందుచేత వచ్చే బుధవారం వస్తుందిట"

ఇద్దరూ కుర్చీల్లో కుప్పకూలిపోయారు.